JAYABHERIDAILY.COM

ప్రభాత

# జయభేరి

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

మేడ్చల్ - మల్కాజిగిరి I ఆదివారం 24-05-2026

Medchal - Malkajgiri I Sunday 24-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 I సంచిక : 358

పేజీలు : 8 I వెల : 5

Vol. 02 I Issue 358 I Pages : 8 I ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?

సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?

మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!

ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..

డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...

"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com





# వేద పాఠశాలకు భూమిపూజ

- వేద మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన
- మెట్లమార్గానికి పైకప్పు, మాడవీధులకు మెట్లు, డార్మిటరీ హాళ్లు, దీక్షాపరులు
- సదనం నిర్మాణాలకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన
- యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించుకున్న సిఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 23 :**

యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పుణ్యక్షేత్రం శనివారం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలనడుమ నిర్వహించిన వేద పాఠశాల భూమిపూజ కార్యక్రమం భక్తులను ఆకట్టుకున్నది. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్ లో రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలతో కలిసి యాదగిరిగుట్టలోని పెద్దగుట్టపైకి చేరుకొని సంప్రదాయ దుస్తుల్లో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో వేద పాఠశాలకు శంకుస్థాపన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సిఎం రేవంత్ రెడ్డి ప్రత్యే క పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యాగశాలలో ప్రత్యేక హోమం నిర్వహించగా, వేద పండితులు

...మిగతాది 2 లో

*యాదగిరిగుట్ట టెంపుల్ సిటీని తిరుమల తిరుపతి దేవస్థానం TTD తరహాలో ఉన్నతంగా తీర్చిదిద్దే సంకల్పంలో భాగంగా ఈ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ. 43.80 కోట్ల అంచనా వ్యయంతో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ వేద పాఠశాలలో సంప్రదాయ ఆశ్రమ గురుకుల పద్ధతిలో 300 మంది విద్యార్థులకు వసతితో కూడిన వేద విద్యను అందించనున్నారు. ఈ సముదాయంలో హోమాలు, యాగాలు నిర్వహించడానికి ప్రత్యేక శాలలతో పాటు ఒక గోశాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. వేద పాఠశాలకు భూమిపూజతో పాటు రూ. 43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదనం నిర్మాణం, కొండపై స్వామివారి నిత్య కల్యాణాల నిర్వహణ కోసం రూ. 9.87 కోట్లతో భారీ కల్యాణ మండపం, భక్తుల సౌకర్యార్థం వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి రూ. 1.41 కోట్లతో రక్షణ పైకప్పు (కానోపీ) నిర్మాణం, రథశాల వైపు వాయవ్య దిశలో ఉన్న మాడవీధులకు అనుసంధానంగా రూ. 1.35 కోట్ల అంచనా వ్యయంతో కొత్త మెట్ల నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.*

# చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం

- ప్రధాని మోదీతో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో భేటీ
- డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని నూతన అమెరికా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు స్వీకరించిన తర్వాత మార్కో రూబియో భారత్‌కు రావడం ఇదే తొలిసారి



**జయభేరి, న్యూఢిల్లీ :**

నాలుగు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న అమెరికా విదేశాంగ మంత్రి (యూఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్) మార్కో రూబియో.. శనివారం ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి కార్యాలయంలో జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీ సుమారు గంటకు పైగా అత్యంత సుదీర్ఘంగా కొనసాగింది. డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని నూతన అమెరికా ప్రభుత్వంలో కీలక బాధ్యతలు స్వీకరించిన తర్వాత మార్కో రూబియో భారత్‌కు రావడం ఇదే తొలిసారి కావడం విశేషం. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ ఈ భేటీకి సంబంధించిన వివరాలను సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకున్నారు. ప్రధాని మోదీ, మార్కో రూబియోల మధ్య చర్చలు అత్యంత ఫలవంతంగా సాగాయని ఆయన పేర్కొన్నారు.

...మిగతాది 2 లో

# బీజేపీ ఇంకో 20 ఏళ్లు



**జయభేరి, న్యూఢిల్లీ, మే 22 :**

ఇటీవల తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. అన్ని సంస్థలు డీఎంకే గెలుస్తుందని ముందస్తు ఫలితాలలో చెప్పేశాయి. కానీ ఒక్క యాక్సిస్ మై ఇండియా మాత్రం టీవీకే గెలుస్తుందని చెప్పింది. అంతే కాదు, తమిళనాడు ఓటర్లు విజయ్ ని ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఆ సంస్థ వ్యాఖ్యానించింది. పైగా డీఎంకే అధినేత స్టాలిన్ ఓడిపోతారని చెప్పారు. దీంతో యావత్ దేశం మొత్తం సంచలనంగా చూసింది. అంతకు మించి ఆశ్చర్యపోయింది. యాక్సిస్ మై ఇండియా సీఈవో ప్రదీప్ గుప్తా ఈసారి అంతకుమించిన సంచలన విషయాన్ని బయటపెట్టారు. 'పరిపాలన బాగున్నంత కాలం ప్రజలు పార్టీకి ఓటేస్తారు. అధికారాన్ని కట్టబెడతారు. ఇందులో ఏమాత్రం అనుమానం లేదు. కాంగ్రెస్ దేశరాజకీయాలను చాలా సంవత్సరాల పాటు ఏలింది. 1977 వరకు కాంగ్రెస్ ప్రస్థానం అద్భుతంగా సాగింది. ఇప్పుడు ఆ పార్టీ పరిస్థితి ఎలా ఉందో చూస్తున్నాం కదా' అంటూ ప్రదీప్ వ్యాఖ్యానించారు.ఒక రాజకీయ తరం 20 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ చక్రం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది. 2014లో భారతీయ జనతా పార్టీ 1.0 మొదలైంది. 2.0 పూర్తయింది. ఇప్పుడు 3.0 నడుస్తోంది. గవర్నెన్స్ బాగున్నంత వరకు ఏమీ కాదు. ఒకవేళ తేడా కొడితే ఇబ్బంది ఎదురవుతుంది. బీజేపీకి ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందో లేదో చెప్పలేం. కానీ బీజేపీ రాజకీయ పరాక్రమం ఇంకా 20 ఏళ్లు ఉండే అవకాశం ఉంది. ఇప్పటికైతే ప్రజల్లో ఎన్డీఏ మీద భారీ అంచనాలు ఉన్నాయి. వచ్చేరోజుల్లో ఎన్డీఏ గొప్పగా పరిపాలించాలని' ప్రదీప్ అభిప్రాయపడ్డారు.ప్రదీప్ మాట్లాడిన మాటలను బీజేపీ స్వాగతిస్తోంది. ఆయన దేశవ్యాప్తంగా ఉన్నవాస్తవ పరిస్థితిని బయటపెట్టారని బీజేపీ నాయకులు అంటున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు ప్రదీప్ మీద తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. దేశం ఇప్పటికే ఎమర్జెన్సీలో ఉందని, మరో 20 ఏళ్లు అంటే ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని కాంగ్రెస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు. ప్రదీప్ బీజేపీకి అనుకూలంగా మాట్లాడి ఏం చెప్పదలుచుకున్నారో తెలుస్తోందని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు



# రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్

**జయభేరి, హైదరాబాద్, మే 23:**

రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు కేటాయించనుంది. అసంపూర్తి ఇందిరమ్మ ఇళ్ల పూర్తి పనులకు నిధులను కేటాయించింది. గోడల దశలో నిలిచిన ఇళ్లకు రూ.3 లక్షల సాయం.. శ్లాబు దశలో ఆగిన ఇళ్లకు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించనుంది. హైదరాబాద్ పరిధిలో లక్ష ఎల్ఐజీ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది. గుడిసెల్లో ఉన్న 15 వేల కుటుంబాలకు వెంటనే ఇళ్లు మంజూరు చేయనుంది. గోదావరి పుష్కరాల పనులకు రూ.1000 కోట్లు కేటాయింపునకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయనుంది. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు రూ.587 కోట్లు కేటాయించింది. వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పాలసీ రూపకల్పన జరిగింది. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే దిశగా పాలసీ రూపొందించారు. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పించాలని, ఇప్పటివరకు ఎక్కువగా తయారీ రంగంపై దృష్టి ఉండగా, ఇకనుంచి ఇన్నోవేషన్, రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ (R&D) యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీ ద్వారా మార్పు తీసుకురావాలని మంత్రిమండలి భావించింది.

# పనిచేసేవారికే గుర్తింపు


- నెల్లూరు నుంచి మంగళగిరికి.. హైబ్రిడ్ మహానాడు నిర్ణయం
- ఈసారి థీమ్ – "స్త్రీ శక్తి మహానాడు"
- క్లస్టర్ బలోపేతానికి ఇదే సరైన సమయం
- పండుగలా మహానాడు.. పార్టీకి కొత్త ఊపు
- స్థానిక ఎన్నికలే లక్ష్యం.. ఇప్పటి నుంచే ఫీల్డ్‌లోకి



**జయభేరి, మంగళగిరి :**

మహానాడు కేవలం పార్టీ కార్యక్రమం కాదని, అది తెలుగుదేశం పార్టీ బలం, క్రమశిక్షణ, త్యాగం, సంస్థాగత శక్తికి ప్రతీక అని టీడీపీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1875 క్లస్టర్ ఇంఛార్జ్‌లతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించిన ఆయన, ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేసి మహానాడును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మొదట నెల్లూరులో భారీ స్థాయిలో మహానాడు నిర్వహించాలని భావించినా, అంతర్జాతీయ పరిస్థితులు, ఇంధన పొదుపు చర్యల నేపథ్యంలో ఈసారి హైబ్రిడ్ విధానాన్ని ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రధాన కార్యక్రమం జరుగుతుండగా, రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ కేంద్రాల్లో వర్చువల్ రూపంలో

...మిగతాది 2 లో




# గ్యాస్ వినియోగదారులకు బిగ్ అలర్ట్

- జూన్ 30లోగా ఇది చేయకపోతే సబ్సిడీ బంద్
- గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగక్కర్లేదు..
- మొబైల్‌లోనే ఇ-కేవైసీ

**జయభేరి, హైదరాబాద్, మే 23:**

దేశవ్యాప్తంగా ఉన్న ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం, గ్యాస్ పంపిణీ సంస్థలు కీలక అలర్ట్ జారీ చేశాయి. సాధారణ ఎల్పీజీ సిలిండర్ వాడుతున్న వారైనా లేదా ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద రాయితీ పొందుతున్న వారైనా... వెంటనే అలర్ట్ అవ్వాల్సిన సమయం వచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఒక చిన్న పని పూర్తి చేయకపోతే, మీ గ్యాస్ సబ్సిడీ శాశ్వతంగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు మీ గ్యాస్ సిలిండర్ బుకింగ్ సేవలకు కూడా అంతరాయం కలగవచ్చు. గ్యాస్ సిలిండర్లపై సబ్సిడీని కొనసాగించడానికి ఇకేవైసీని తప్పనిసరి చేసినట్లు ఎల్పీజీ పంపిణీదారులు స్పష్టం చేశారు. నకిలీ కనెక్షన్లను అరికట్టడానికి, అర్హులైన వారికే సబ్సిడీ అందించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మీ ఇకేవైసీ ని అప్‌డేట్ చేయడానికి జూన్ 30ని చివరి తేదీగా నిర్ణయించారు. కాబట్టి వినియోగదారులు ఆఖరి నిమిషం వరకు ఆగకుండా, అంతకంటే ముందే ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవడం ఉత్తమం.

**మొబైల్‌లోనే ఇ-కేవైసీ**

ఈ మండుటెండల్లో ఇకేవైసీ కోసం గ్యాస్ ఆఫీసుల చుట్టూ, బ్యాంకులు లేదా పోస్ట్ ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. మీ మొబైల్ ద్వారా ఇంటి నుంచే కేవలం 5 నిమిషాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. విధానం 1: గ్యాస్ కంపెనీ అధికారిక యాప్ ద్వారా మీ గ్యాస్ కంపెనీ అధికారిక మొబైల్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోండి.

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## గ్యాస్ వినియోగదారులకు బిగ్ అలర్ట్

మీ గ్యాస్ కనెక్షన్‌కు లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్‌తో లాగిన్ అవ్వండి. యాప్‌లోని My Profile ఆప్షన్‌పై క్లిక్ చేయండి. అక్కడ మీకు LPG వివరాల క్రింద eKYC ఆప్షన్ కనిపిస్తుంది. నిబంధనలు, షరతులను చదివి.. అంగీకరిస్తున్నాను పై క్లిక్ చేయండి. ఇప్పుడు మీ రిజిస్టర్డ్ మొబైల్‌కు వచ్చే OTP ద్వారా లేదా ఫేస్ స్కాన్ ద్వారా మీ గుర్తింపును ధృవీకరించి, సబ్మిట్ చేయండి. మీ eKYC 24 నుండి 48 గంటలలోపు అప్‌డేట్ అవుతుంది.

**విధానం 2: ఉమాంగ్ యాప్ ద్వారా**

ఒకవేళ మీ గ్యాస్ కంపెనీకి ప్రత్యేక యాప్ లేకపోయినా, లేదా అందులో సాంకేతిక సమస్యలు వచ్చినా ప్రభుత్వ అధికారిక ఉమాంగ్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు:

**ఉమాంగ్ యాప్‌ను ఓపెన్ చేసి లాగిన్ అవ్వండి.**

సెర్చ్ బార్‌లో Gas Service ఆప్షన్‌పై క్లిక్ చేయండి. అక్కడ కనిపించే eKYC ఆప్షన్‌పై క్లిక్ చేయండి. మీ ఆధార్ వివరాలు ఎంటర్ చేసి, OTP లేదా బయోమెట్రిక్ ప్రక్రియను పూర్తి చేయండి. ఆన్‌లైన్‌లో ఇకేవైసీ చేసేటప్పుడు ఫేస్ అథెంటికేషన్ కోసం గూగుల్ ప్లే స్టోర్ నుండి ప్రభుత్వ అధికారిక AadhaarFaceRd యాప్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ మీ ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్ లింక్ లేకపోతే మాత్రం, మీరు నేరుగా మీ గ్యాస్ ఏజెన్సీకి వెళ్లి బయోమెట్రిక్ ద్వారా ఇకేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. సబ్సిడీ సొమ్మును కోల్పోకుండా ఉండాలంటే వెంటనే మీ మొబైల్‌లో ఈ రోజే ఇకేవైసీ స్టేటస్ చెక్ చేసుకోండి.

## చైనా దూకుడుకు అడ్డుకట్ట..

ఇరు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాలలో భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై ఇరువురు నేతలు చర్చించారు. అంతర్జాతీయంగా అత్యంత కీలకమైన స్వేచ్ఛాయుత, సురక్షిత ఇండోపసిఫిక్ రీజియన్‌ను ముందుకు నడిపించే మార్గాలపై ఇరు దేశాల వ్యూహాత్మక ఆలోచనలను పంచుకున్నారు. శనివారం ఉదయం అమెరికా నుంచి నేరుగా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా చేరుకున్న మార్కో రూబియో.. తన పర్యటనను ఒక సద్భావన కార్యక్రమంతో ప్రారంభించారు. తన సతీమణి జీనెట్‌తో కలిసి మదర్ థెరీసా స్థాపించిన 'మిషనరీస్ ఆఫ్ ఛారిటీ'ని ఆయన సందర్శించారు. అక్కడ మదర్ థెరీసా సమాధిని దర్శించుకుని ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె సమాజానికి చేసిన నిస్వార్థ సేవలను కొనియాడుతూ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా రూబియో ఒక భావోద్వేగ పోస్ట్‌ను కూడా షేర్ చేశారు. భారత పర్యటనలో భాగంగా అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మే 26న న్యూఢిల్లీలో జరగబోయే 'క్వాడ్' కూటమి విదేశాంగ మంత్రుల అత్యంత ప్రతిష్టాత్మక సమావేశంలో పాల్గొంటారు. హిందూ మహాసముద్రం, పసిఫిక్ ప్రాంతాల్లో చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఏర్పడిన ఈ చతుర్భుజ కూటమిలో భారత్ సహా అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ దేశాలు భాగస్వాములుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ సమావేశంలో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై ఇరు దేశాల మంత్రులు మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

## వేద పాఠశాలకు భూమిపూజ

ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి సంబంధించిన రూ. 99.56 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, వైటీడీఏ వైస్ ఛైర్మన్ కిషన్ రావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం**

యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా సిఎం రేవంత్ రెడ్డి పలు నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు.రూ.43.80 కోట్లతో వేద పాఠశాల నిర్మాణం, రూ.9.87 కోట్లతో కొండపైన స్వామి వారి నిత్య కల్యాణ మండపం నిర్మాణం, రూ.1.41 కోట్లతో వైకుంఠద్వారం నుంచి కొండపైకి వెళ్లే మెట్ల మార్గానికి పైకప్ నిర్మాణం, రూ.1.35 కోట్లతో రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణం, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాళ్లు,దీక్షాపరులు సదనం నిర్మాణం చేపట్టనున్నారు. పెద్దగుట్టపై భూమి పూజ కార్యక్రమం ముగిసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి కొండపైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దర్శనానికి రోడ్డు మార్గం ద్వారా బయల్దేరి కొండపైకి చేరుకున్నారు. తూర్పు రాజగోపురం మార్గంగా ఆలయంలోకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డిలకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాల మధ్య సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**రెండు గంటలకుపైగా యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ రెడ్డి**

సీఎం రేవంత్ రెడ్డి రెండు గంటలకు పైగా యాదగిరిగుట్టలో గడిపారు. ఉదయం 8:42 గంటలకు పెద్దగుట్ట మీద ఉన్న హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. 9.23కు వేద పాఠశాల శంకుస్థాపన స్థలం వద్దకు చేరుకొని,9:37 గంటలకు ముహూర్తం ప్రకారం శంకుస్థాపన నిర్వహించారు. 9:41 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ఐదు అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. 9:44 గంటలకు పూజ స్థలం వద్ద కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. 9:52 గంటలకు కాన్వాయ్ ద్వారా పెద్దగుట్ట నుంచి యాదగిరిగుట్ట ప్రధానాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం 10:56 నిమిషాలకు హెలి కాప్టర్ ద్వారా హైదరాబాద్ కు వెళ్లిపోయారు.

## పనిచేసేవారికే గుర్తింపు

మహానాడు నిర్వహించనున్నారు.

**ఈసారి థీమ్ – "స్త్రీ శక్తి మహానాడు"**

ఈ ఏడాది మహానాడును "స్త్రీ శక్తి మహానాడు" థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు లోకేష్ తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి క్లస్టర్‌లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కుటుంబ సాధికార సారధి నుంచి బూత్ ఇంఛార్జ్‌లు, గ్రామ కమిటీలు, క్లస్టర్ కమిటీ సభ్యుల వరకు ప్రతి ఒక్కరూ మహానాడులో పాల్గొనాలని సూచించారు. క్లస్టర్ వ్యవస్థను మరింత బలపరచడానికి ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల మధ్య అనుబంధం పెంచడమే లక్ష్యమని వివరించారు. సాంకేతిక సన్నాహాలు తప్పనిసరి ప్రతి క్లస్టర్ కేంద్రంలో ఎల్ఈడీ టీవీలు, స్పీకర్లు, అవసరమైన సాంకేతిక వసతులు సిద్ధంగా ఉండాలని సూచించారు. పార్టీ తరఫున అవసరమైన మెటీరియల్ అందజేస్తామని చెప్పారు. హాజరును మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేయనున్నట్లు తెలిపారు. కేఎస్ఎస్, బూత్ కమిటీలు, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల సభ్యులందరినీ మహానాడుకు ఆహ్వానించాలని లోకేష్ సూచించారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంఛార్జ్‌లతో సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహానాడును పండుగ వాతావరణంలో నిర్వహించాలని, ప్రతి కార్యకర్త బాధ్యతగా భావించాలని లోకేష్ అన్నారు. వ్యక్తులు కాదు, వ్యవస్థే శాశ్వతమని గుర్తు చేశారు. క్లస్టర్ ఇంఛార్జ్‌లకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని, అందుకే నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకం కావాలని సూచించారు. గత రెండు సంవత్సరాలుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి వెళ్లాయని, ఇప్పుడు మరింత వేగంగా పార్టీని బలోపేతం చేయాల్సిన సమయం వచ్చిందన్నారు. పార్టీ కోసం కష్టపడేవారిని మై టీడీపీ యాప్ ద్వారా గుర్తిస్తున్నామని తెలిపారు. నామినేటెడ్ పదవుల్లో కూడా పనిచేసిన వారికి ప్రాధాన్యత ఇచ్చామని, ఇకపై కూడా పనితీరే ప్రమాణంగా ఉండబోతుందని స్పష్టం చేశారు. ఈసారి మహానాడు కేవలం సమావేశం కాదు. పార్టీ శక్తిని క్లస్టర్ స్థాయిలో పరీక్షించే భారీ రాజకీయ వ్యూహంగా మారబోతోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

# మళ్లీ తెర పైకి డీలిమిటేషన్




నియోజకవర్గాల పునర్విభజనపై చిదంబరం చేసిన ట్వీట్‌పై స్పందించిన ఏపీ మంత్రి నారా లోకేష్‌కు.. తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. రాజ్యాంగ సంబంధిత ఆందోళనలకు రాజకీయ నాటకాలతో కాదు, రాజ్యాంగబద్ధమైన సమాధానాలతోనే స్పందించాలని చురకలు అంటించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని గతంలో చంద్రబాబు చెప్పిన రక్షణ ఎక్కడ అంటూ లోక్షను పొంగులేటి ప్రశ్నించారు. కొన్ని నెలలుగా దేశవ్యాప్తంగా డీలిమిటేషన్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పి.చిదంబరం.. తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ మధ్య ఎక్స్‌లో మాటల యుద్ధం జరుగుతోంది. ఈ క్రమంలోనే చిదంబరం చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ.. నారా లోకేష్ చేసిన ట్వీట్‌కు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమాధానం ఇచ్చారు. రాజ్యాంగ అంశాలకు రాజకీయాలతో కాకుండా.. రాజ్యాంగబద్ధంగానే స్పందించాలని హితవు పలికారు.

ఈ సందర్భంగా నారా లోకేష్‌కు సమాధానంగా సుదీర్ఘంగా ట్వీట్ చేశారు. అందులో కొన్ని గణాంకాలతో కూడిన ఫోటోను కూడా జత చేశారు.ప్రియమైన లోకేష్ గారు అంటూ ట్వీట్‌ను మొదలుపెట్టిన మంత్రి పొంగులేటి.. డీలిమిటేషన్ బిల్లు 2026లో దామాషా లెక్కల ప్రకారం సీట్ల పెంపునకు సంబంధించిన చట్టబద్ధ హామీ ఎందుకు లేదని ప్రశ్నించారు. చట్టంలో ఎలాంటి రక్షణ కల్పించకుండా బీజేపీ నాయకుల మాటలను మాత్రమే దక్షిణాది రాష్ట్రాలు ఎందుకు నమ్మాలని నిలదీశారు. ఎన్నో ఏళ్ల హామీలు, భరోసాలతో చివరికి మోసపోయిన తర్వాత కూడా.. కేవలం మాటలనే దక్షిణాది ప్రజలు ఎలా విశ్వసిస్తారని పేర్కొన్నారు.జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతుందని ఈ బిల్లులో స్పష్టంగా పేర్కొన్నారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. ఈ రకంగా డీలిమిటేషన్ ప్రక్రియను అమలు చేస్తే లోక్‌సభలో తెలంగాణ వాటా ప్రస్తుతం 3.13 శాతం ఉండగా.. అది సుమారు 2.85 శాతానికి కు పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. దీంతో తెలంగాణ 2, 3 లోక్‌సభ సీట్లను కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్ వాటా 4.6 శాతం నుంచి సుమారు 4.1 శాతానికి తగ్గి.. 4, 5 సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. సమర్థవంతంగా జనాభా నియంత్రణను అమలు చేసిన రాష్ట్రాలకే ఈ పరిస్థితి ఎదురవుతోందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు.ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీతో పాటు దక్షిణాది ప్రజలు కూడా పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారని.. కానీ మీరు మాత్రం ఆ సమస్యను కావాలనే విస్మరిస్తున్నారని లోకేష్‌కు గుర్తు చేశారు.

ప్రస్తుతం అనధికారికంగా చర్చిస్తున్న 50 శాతం సీట్ల పెంపు మోడల్ అమలు చేసినా.. ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల మధ్య అసమానతలు మరింత పెరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 80 నుంచి 120కు పెరిగితే.. తెలంగాణలో 17 నుంచి 26కు.. ఏపీలో 25 నుంచి 38కు మాత్రమే పెరుగుతాయని తెలిపారు. దీంతో యూపీతెలంగాణ మధ్య ప్రస్తుతం ఉన్న 63 సీట్ల తేడా 94 సీట్లకు పెరుగుతుందని గుర్తు చేశారు. ఇక యూపీఏపీ మధ్య వ్యత్యాసం 55 నుంచి 82 సీట్లకు చేరుతుందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు పార్లమెంట్‌లో మరింత రాజకీయ ఆధిపత్యం లభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అదే 50 శాతం పెంపు మోడల్‌ను దేశవ్యాప్తంగా అమలు చేస్తే.. దక్షిణాదిన ఉన్న 5 రాష్ట్రాలకు కలిపి సుమారు 66 మాత్రమే అదనపు సీట్లు వస్తాయని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గణాంకాలు వెల్లడించారు. అదే సమయంలో ఉత్తరాదిన మరీ ముఖ్యంగా హిందీ బెల్ట్ రాష్ట్రాలకు దాదాపు 142 అదనపు సీట్లు లభిస్తాయని.. ఈ పెరుగుతున్న అసమానతే అసలు సమస్య అని తెలిపారు.

జనాభా నియంత్రణ, మెరుగైన పాలన, ఆర్థికాభివృద్ధి, దేశ ఆర్థిక వ్యవస్థకు అధికంగా సహకరించినందుకు దక్షిణాది రాష్ట్రాలను శిక్షించకూడదని పొంగులేటి పేర్కొన్నారు.ఐదు దక్షిణాది రాష్ట్రాలు కలిపి దేశ జీడీపీలో సుమారు 31 శాతం నుంచి 33 శాతం వరకు వాటా కల్పిస్తున్నాయని.. కేంద్ర ప్రభుత్వ ఖజానాకు కూడా అధికంగా ఆదాయాన్ని అందిస్తున్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు. అయినప్పటికీ కేంద్రం నుంచి రాష్ట్రాలకు లభిస్తున్న కేటాయింపులు తక్కువగా ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ తప్పనిసరి అయితే.. ప్రాతినిధ్యాన్ని కేవలం జనాభా ఆధారంగా మాత్రమే నిర్ణయించకూడదని.. ఆర్థిక సహకారం, అభివృద్ధి సూచికలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న 24 శాతం స్థానంలో.. దక్షిణాది రాష్ట్రాల జీడీపీ వాటాకు అనుగుణంగా లోక్‌సభలో కనీసం 33 శాతం ప్రాతినిధ్యం కల్పించాలని పొంగులేటి డిమాండ్ చేశారుదక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా పక్కనబెట్టడం కాదని.. న్యాయమైన ప్రాతినిధ్యం లభించాలని తేల్చి చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలతో సంపూర్ణ ఏకాభిప్రాయం వచ్చిన తర్వాతే డీలిమిటేషన్ ప్రక్రియపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

అంతేకాకుండా 2001లో చంద్రబాబు నాయుడు.. దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని రక్షించేందుకు చట్టంలో రాజ్యాంగబద్ధమైన హామీ ఉండాలని తేల్చి చెప్పారని.. అది కూడా కేవలం మాటల భరోసాలు సరిపోవని స్వయంగా ఆయనే చెప్పారని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. అయితే ఆ రక్షణ డీలిమిటేషన్ బిల్లు 2026లో ఎక్కడ ఉందని లోకేష్‌కు మంత్రి పొంగులేటి సూటి ప్రశ్న వేశారు.



# ఎందుకు రాజీనామాలు చేశారు

## నిన్న రెరా చైర్మన్ సత్యనారాయణ.. నేటి విద్యా కమిషన్ చైర్మన్ మురళి..

జయభేరి, హైదరాబాద్, మే 23 :



సాధారణంగా ప్రభుత్వంలో అధికారులు రాజీనామా చేయడం అరుదుగా జరుగుతూ ఉంటుంది. రాజీనామా కోణాన్ని మీడియా లోతుగా అధ్యయనం చేస్తూ ఉంటుంది. అసలు విషయాన్ని బయటపడుతూ ఉంటుంది. ఒకవేళ వ్యక్తిగత ఆరోగ్యం బాగా లేకపోతే లేదా ప్రభుత్వంతో ఇబ్బందులు ఎదురైతే అధికారులు రాజీనామా చేస్తారు. ఒక స్థాయి అధికారులకు ప్రభుత్వంలో అండదండలు బాగా ఉంటాయి. ముఖ్యమంత్రి స్థాయిలో పరిచయాలు ఉంటాయి కాబట్టి జీతభత్యాలు కూడా అంతకుమించి అనే స్థాయిలో ఉంటాయి. మంచి హోదా కూడా ఉంటుంది కాబట్టి అధికార దర్పాన్ని కూడా బ్రహ్మాండంగా అనుభవించవచ్చు.

ఇన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ రాజీనామా చేశారంటే కచ్చితంగా అనుమానించాల్సిందే. పైగా సర్వీస్ కూడా ఉన్నప్పుడు ఇటువంటి రాజీనామా వ్యవహారాలను సాధారణంగా చూడకూడదు.భారత రాష్ట్రపతి అధికారంలో ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి తన పదవికి రాజీనామా చేశారు. అప్పట్లో ఈ విషయం ఒక సంచలనం. ఆ తర్వాత ఆయన ఏపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు విద్యా కమిషన్ చైర్మన్గా పని చేశారు. అక్కడ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. పాఠశాలలను అభివృద్ధి చేసి.. సరికొత్త సౌకర్యాలు కల్పించారు. డ్రాప్ అవుట్లు తగ్గేలా చూశారు. పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేశారు.. తద్వారా ఏపీ ప్రభుత్వ పాఠశాలలో ప్రమాణాలు పెరిగాయి.

విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో విద్యను అభ్యసించారు. అది నచ్చి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మురళికి విద్యా కమిషన్ చైర్మన్గా పదవి కల్పించారు. ఇది క్యాబినెట్ ర్యాంకు హోదా పదవి.ఇటీవల తెలంగాణ విద్యా విధానంలో చేపట్టాల్సిన మార్పుల గురించి మురళి ప్రభుత్వానికి ఒక నివేదిక అందించారు. అందులో ప్రభుత్వ టీచర్ల జీతాలు ఎక్కువగా ఉన్నాయని.. వాటిని పెంచాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

పదవ తరగతి, ఇంటర్ విద్యను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని.. అవసరమైతే పదో తరగతి విద్యను కాస్త ప్లస్ 2 గా మార్చి.. తమిళనాడు, కేరళ స్థాయిలో విద్యా విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మురళి సమర్పించిన నివేదిక తెలంగాణ రాజకీయాలలో కలకలం సృష్టించింది. ముఖ్యంగా భారత రాష్ట్ర సమితి మురళి నివేదికను నెగిటివ్గా ప్రచారం చేయడం మొదలుపెట్టింది.. ఈ నివేదిక పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కాస్త ఆగ్రహంగా ఉన్నట్టు తెలిసింది.

మురళి నివేదిక వల్ల ప్రభుత్వ టీచర్లలో ప్రభుత్వం పట్ల వ్యతిరేక భావన కలిగిందని సమాచారం. అప్పటినుంచి మురళి, ప్రభుత్వం మధ్య విభేదాలు ఏర్పడ్డాయని ప్రచారం జరిగింది.కొంతకాలంగా మురళి కూడా తన మీద వస్తున్న విమర్శల పట్ల నిరాశ లో ఉన్నారని తెలుస్తోంది. అందువల్లే ఆయన తన పదవికి శుక్రవారం రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. రాజీనామా లేఖను ముఖ్యమంత్రి కార్యాలయానికి ఆయన పంపించారు.. మురళి కంటే ముందు రెరా చైర్మన్ సత్యనారాయణ కూడా తన పదవికి రాజీనామా చేశారు.. వాస్తవానికి రెరా అనేది అత్యంత డిమాండ్ ఉన్న విభాగం.

ఒక రకంగా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగానికి గుండెకాయలాంటిది. ఈ పదవిలో సత్యనారాయణ ను రేవంత్ రెడ్డి ఏరికోరి నియమించారు. తనమీద ఎన్ని రకాల ఒత్తిళ్లు వచ్చినప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం తగ్గకుండా సత్యనారాయణ ను నియమించారు. కొంతకాలం పాటు ఆయన కూడా సక్రమంగానే పనిచేశారు. అయితే ఇటీవల హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మీద గులాబీ పార్టీ నెగటివ్ ప్రచారం చేయడం మొదలుపెట్టింది.

సత్యనారాయణ మీద కూడా లేనిపోని ఆరోపణలు చేసింది. రాష్ట్ర విద్యా బడ్జెట్‌ను ప్రస్తుతమున్న స్థాయి నుంచి 18 శాతానికి పెంచాలని కమిషన్ సిఫార్సు చేసింది. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2,000 ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ గా మార్చి, వాటిలో ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ల్యాబ్‌లు, లైబ్రరీలు, స్పోర్ట్స్ సౌకర్యాలు , బస్సు కనెక్టివిటీ కల్పించాలని ప్రతిపాదించింది. విద్యార్థుల ఒత్తిడిని తగ్గించేందుకు 11వ తరగతి అంటే ఇంటర్ ప్రథమ సంవత్సరం బోర్డు పరీక్షలను రద్దు చేయాలని కీలక సూచన చేసింది.

టీచర్ల విషయంలో కమిషన్ చాలా కఠినమైన సంస్కరణలను ప్రతిపాదించింది. ఇకపై ఉపాధ్యాయులకు ఆటోమేటిక్ ప్రమోషన్లు ఉండకూడదని, ప్రతి ఐదేళ్లకోసారి వారి పనితీరును సమీక్షించాలని పేర్కొంది. ఒకవేళ పనితీరు బాగోలేకపోతే, మెరుగుపరుచుకోవడానికి రెండేళ్ల సమయం ఇచ్చి, అప్పటికీ మార్పు రాకపోతే వారిని సర్వీస్ నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది.

అయితే, ఈ నిబంధనలు కేవలం భవిష్యత్తులో నియమితులయ్యే కొత్త టీచర్లకే వర్తిస్తాయని స్పష్టం చేసింది.రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 80 శాతానికి పైగా బోధనా పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని, 86 శాతం కాలేజీలకు ఎన్ఏఏసీ గ్రేడింగ్ లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రైవేట్ స్కూళ్ల ఫీజులను అదుపు చేసేందుకు ఒక స్టాట్యూటరీ ఫీజు రెగ్యులేటరీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అలాగే ఐఐటీజేఈఈ, నీట్ కోచింగ్ సెంటర్లు మరియు హాస్టళ్ల పర్యవేక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని నివేదికలో పేర్కొంది. రాజీనామా లేఖలో ఆకునూరి మురళి ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను పూర్తి చేశాను, అందుకే తప్పుకుంటున్నాను అని ప్రకటించినప్పటికీ, ఈ విప్లవాత్మక సిఫార్సులను అమలు చేసే విషయంలో ప్రభుత్వ వైఖరిపై ఆయనకు ఏవైనా అసంతృప్తి ఉందా అనే చర్చ ప్రస్తుతం విద్యా వర్గాల్లో సాగుతోంది. పైగా ప్రభుత్వ పెద్దల నుంచి అతడికి సహకారం అందకపోవడంతో.. కొన్ని వ్యవహారాలలో ఆయనను కలగజేసుకోకూడదని చెప్పడంతో.. తట్టుకోలేక తన పదవికి రాజీనామా చేశారు. సత్యనారాయణ రాజీనామాను మర్చిపోకముందే.. ఆకునూరి మురళి రాజీనామా చేయడం.. సంచలనం కలిగిస్తోంది. మరి దీనిపై తెలంగాణ ప్రభుత్వం ఏ విధంగా వివరణ ఇస్తుంది.. అనేది చూడాల్సి ఉంది.

# సీఎం పర్యటనలో తీవ్ర ప్రోటోకాల్ లోపం

- 15 నిమిషాల పాటు చాపర్లోనే ఉండిపోయిన
- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు
- మూడు రోజులు సమీక్షలు చేసినా దక్కని ఫలితం రెండు హెలిప్యాడ్ ఏర్పాటుతో ఘోర వైఫల్యం
- యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్,ఎస్పీ నిర్లక్ష్యంపైన సచివాలయ వర్గాల తీవ్ర ఆగ్రహం



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 23:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యాదగిరిగుట్ట పర్యటనలో జిల్లా యంత్రాంగం ఘోర వైఫల్యం చెందింది. అధికారుల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్, సమన్వయ రాహిత్యం కారణంగా సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలో తీవ్ర ప్రోటోకాల్ లోపం తలెత్తింది. రెండు వేర్వేరు చోట్ల హెలిప్యాడ్ ను ఏర్పాటు చేయడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణమైంది. టెంపుల్ సిటీ హెలిప్యాడ్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి ల్యాండ్ అయిన తర్వాత కూడా స్వాగతం పలికేందుకు అధికారులు ఎవరూ లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర మంత్రులు సుమారు 15 నిమిషాల పాటు హెలికాప్టర్ లోనే వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. అట్టహాసంగా సమీక్షలు క్షేత్రస్థాయిలో అట్టర్ ఫ్లాప్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనలో ఎలాంటి లోటు పాట్లు,అవకతవకలు జరగకూడదని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ ఆకాంక్ష్ యాదవ్ గత మూడు రోజులుగా అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. బుధ,గురు,శుక్ర వారాల్లో సైతం సమీక్షలు జరిపారు. ఇక శుక్రవారం నాడు ప్రభుత్వ విప్,ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య స్వయంగా క్షేత్రస్థాయికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఇంత మంది పెద్దలు, ఉన్నతాధికారులు మూడు రోజులుగా పర్యవేక్షించినప్పటికీ... తీరా సీఎం రేవంత్ రెడ్డి వచ్చే సరికి హెలిప్యాడ్ ల్యాండింగ్ ఇంతటి గందరగోళం నెలకొనడం జిల్లా అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

**అసలేం జరిగిందంటే..?**

అధికారుల ప్లాన్ ప్రకారం టెంపుల్ సిటీ పైన వేదపాఠశాల శంకుస్థాపన చేసే ప్రదేశంలో ఒక హెలిప్యాడ్,కొండ కింద ఉన్న ప్రెసిడెన్షియల్ సూట్ సమీపంలో మరొక హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. షెడ్యూల్ ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి మొదట స్వామివారి దర్శనానికి వెళ్లాల్సి ఉండటంతో,యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్,ఎస్పీలతో కూడిన అధికార యంత్రాంగమంతా కొండ కింద ప్రెసిడెన్షియల్ సూట్ సమీపంలో ఉన్న హెలిప్యాడ్ వద్దే కాపు కాశారు. అయితే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ నేరుగా టెంపుల్ సిటీ వద్ద ఉన్న మొదటి హెలిప్యాడ్ ల్యాండ్ అయింది. తీరా చాపర్ దిగాక చూస్తే అక్కడ సీఎం రేవంత్ రెడ్డిను రిసీవ్ చేసుకోవడానికి కనీసం ఒక్క ప్రోటోకాల్ అధికారి గానీ,పోలీస్ బందోబస్తు గానీ లేకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనానికి గురైనట్లు సమాచారం.

**అధికారులపై వేటుకు రంగం సిద్ధం...?**

అత్యంత ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయడంలో జిల్లా యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందిందని ఈ ఘటన ద్వారా బట్టబయలైంది. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన జిల్లా కలెక్టరేట్ ,పోలీస్ యంత్రాంగం తీరుపైన సచివాలయ వర్గాలు తీవ్రంగా పరిగణించాయి. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనలోనే ఇంతటి నిర్లక్ష్యం వహించినందుకు గానూ.. కమ్యూనికేషన్ గ్యాప్ కారణమైన బాధ్యులపై త్వరలోనే శాఖాపరమైన కఠిన చర్యలు పడే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. కాగా ఈ విషయమై వివరణ కోరేందుకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి ఫోన్ చేయగా స్పందించలేదు.



# శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి

**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం తీదేడు గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండపం నిర్మాణానికి గ్రామ ప్రజలు,యువత స్వచ్ఛందంగా విరాళాలు అందించడం అభినందనీయమని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా కలకొండ లక్ష్మి మల్లేశం 1,00116/(ఒక లక్ష నూట పదహారు రూపాయలు),కుర్మేడు గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు పి.ఏ.సి.యస్ డైరెక్టర్ అండేకార్ అశోక్ 51,000/ యాభై ఒక్క వేల రూపాయల విరాళాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి దక్షిణ మండప నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.ఆలయ అభివృద్ధికి ప్రతి ఒక్కరు ముందుకు రావడం సంతోషకరమని అన్నారు.

# నిరుపేద కుటుంబానికి అండగా Rk సేవా ఫౌండేషన్



**జయభేరి, నేరేడుగొమ్ము :**

నేరేడు గోమ్ము మండలంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన ట్రాక్టర్ డ్రైవర్ దశరథ కుటుంబానికి Rk సేవా ఫౌండేషన్, BRS నాయకులు వడ్త్య రమేష్ ఆర్థిక సహాయం అందజేశారు వారి పరిస్థితి గమనించిన BRS నాయకులు పార్టీ తరుపున గృహ నిర్మాణానికి 50 బస్తాల సిమెంట్ ఒప్పుకొని కుటుంబాన్ని ఓదార్చారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు ,వడ్త్య రమేష్ నాయక్ కి ఫౌండేషన్ సభ్యులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపి వారి సేవలు మా ఫౌండేషన్ పై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో నేరేడుగొమ్ము సర్పంచ్ పులికంటి సుధాకర్, BRS మాజీ PACS చైర్మన్ బాల్లయ్య, ఉపాధ్యక్షులు కరాటే మాస్టర్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పొట్ట విజయ్ కుమార్, ఇరగదిండ్ల రామకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ ముఖ్య సలహాదారులు ఆరేకంటి రాములు, జక్కుల లింగం,గార్లపాటి శ్రీకాంత్, అరకంటి యేసయ్య,అరకంటి విజయ్, పాస్టర్ ప్రసాద్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రాకతో ముందస్తు అరెస్టులు

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 23 :**




తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో విపక్షాలు నాయకులతో పాటు యాదగిరి కొండపైన వర్తక సంఘం రద్దుచేసి దుకాణాలకు బహిరంగ వేలం వేయాలని డిమాండ్ చేస్తున్న యాదగిరిగుట్ట పరిరక్షణ కమిటీ నాయకులను పోలీసులు శనివారం తెల్లవారు జామున ముందస్తు అరెస్ట్ చేసి సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమం ముగిసిన తర్వాత వదిలిపెట్టారు. బీఆర్ఎస్ నాయకుల అరెస్టు యాదగిరిగుట్ట ఆలయ అభివృద్ధిలో భాగంగా గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన శంకుస్థాపనలకే మళ్లీ శంకుస్థాపన చేస్తున్నారని కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారని బిఆర్ఎస్ నాయకులు కర్రె వెంకటయ్య, పాపట్ల నరహరి, సత్యనారాయణ యాదవ్ ఆరే శ్రీధర్ గౌడ్, బీర్ల మహేష్, గుణగంటి బాబు రావు,కర్రె చంద్రశేఖర్ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**25 మంది పరిరక్షణ కమిటీ సభ్యుల అరెస్టు**

తక్షణం కొండపైన వర్తక సంఘాన్ని రద్దుచేసి దుకాణాలను టెండర్ ప్రక్రియ ద్వారా స్థానికులకు వచ్చే విధంగా వేయాలని... తద్వారా యాదగిరిగుట్ట దేవస్థానం ఖజానాకు ప్రతి ఏటా 30 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుందని డిమాండ్ చేస్తూ పరిరక్షణ కమిటీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్ట్ చేసిన వారిలో కాటబత్తిని ఆంజనేయులు, రచ్చ శ్రీనివాస్, పల్లపు బాలయ్య, గ్యాదపాక బాల నరసయ్య, కల్వకొలను సతీష్, మాటూరి బాలయ్య, కర్రె ప్రవీణ్, బుగ్గ అంజనేయులు, బండి వాసు,బండి అనిల్, ముఖ్యర్ల వెంకటేష్, నరసింహ, కృష్ణ,ప్రసాద్, శ్యామ్, నరేష్, సంజీవ, ప్రభాకర్, రామస్వామి, కుమార్, శివ, రవి, అజయ్, రాజు తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# సీనియర్ సిటిజన్ మండల నూతన కమిటీ ఎన్నిక

**జయభేరి, తుర్కపల్లి, మే 23 :**



తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ మండల నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు ఎర్రగుంట్ల వెంకటేశం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల నూతన అధ్యక్షునిగా డాక్టర్ అంబటి చెన్న కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి నరసింహారెడ్డి, నక్క శ్రీశైలం, తునికి మహిరెడ్డి, పిన్నపురెడ్డి నరేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా కొమ్మిరి శెట్టి నరసింహులు సంయుక్త కార్యదర్శిగా పలుగుల దశరథ, ప్రచార కార్యదర్శిగా సిద్ధి రామాచారి, కోశాధికారులుగా పోరెడ్డి మహిపాల్ రెడ్డి, ఆకుల బాలరాజు, సభ్యులుగా గొల్ల కేతమ్మ, కోడూరి ఆంజనేయులు, కసిరబోయిన గోపాల్, గడిపే ఇస్తారి, దిరావత్ బిచ్చు, ముఖ్య సలహా అధికారిగా పదాల చంద్రం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పిల్లలను కనిపించి ప్రయోజకులుగా ఎదగడానికి సర్వశక్తులు ధారపోసిన తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో ఆ పిల్లలు వారిని అవమాన పరుస్తూ, నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని ఇది అత్యంత బాధాకరమైన విషయం అని అన్నారు. వయోవృద్ధులు తమ పిల్లలనుండే కాకుండా సేవకులు ఇరుగుపొరుగు వారి నుండి వేధింపులకు గురవుతున్నారని అన్నారు. ఆస్తుల కోసం వేధింపులకు గురి చేస్తున్నారని పోషణ చేయకుండా గురి చేస్తున్నారని, వైద్య చికిత్సల ఖర్చు పెట్టకుండా వేధింపులకు గురి చేస్తున్నారని ,ఇతర కారణాల వల్ల వేధింపులు గురి చేస్తున్నారని, ఇట్టి నివారణకు వేధింపులకు గురైన వయోవృద్ధులకు సంఘం అనేక విధాలుగా తోడ్పడుతుందని అన్నారు. కుటుంబ సభ్యులు వయోవృద్ధుల పట్ల శ్రద్ధ తీసుకోవాలని, వారి అవసరాలను తీర్చాలని సమాజంలో వయోవృద్ధుల పట్ల గౌరవం అవగాహన పెంచాలని వేధింపులకు గురి అయిన వయోవృద్ధులకు సహాయం చేయడానికి వారిని రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, వయోవృద్ధుల వేధింపులకు వ్యతిరేకంగా చట్టాలను ప్రతిష్టంగా అమలు పరచాలని కోరారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నిబంధనలు, నేర నివారణ చట్టం 1983 ప్రకారం చర్యలు తీసుకోబడునని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సాదినేని దశరథ, మండలంలోని వివిధ గ్రామాల సీనియర్ సిటిజన్ సభ్యులు పాల్గొన్నారు.

# జై జవాన్...జై కిసాన్

**జయభేరి, ఏలూరు :**

కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని అంజనేయులు ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, వేల్పుచెర్ల గ్రామాన్ని సందర్శించి పాడి రైతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, ఆ గ్రామానికి చెందిన రైతు జి. లక్ష్మణ్ గారి కుమారుడు దేశ సేవలో సీఆర్పిఎఫ్ జవానుగా విధులు నిర్వహిస్తున్న జి. శ్రీకాంత్ ను ఘనంగా సత్కరించారు. సుమారు పది సంవత్సరాలుగా జవానుగా దేశ సేవలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ శ్రీ శ్రీకాంత్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు.

ఈ సందర్భంగా ఛైర్మన్ ఆంజనేయులు భావోద్వేగంగా మాట్లాడుతూ, "దేశానికి అన్నం పెట్టే రైతు కుటుంబం నుంచే దేశ సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడే జవాన్లు రావడం మన అందరికీ గర్వకారణం. రైతు చెమటతో దేశం బతుకుతుంది... జవాను త్యాగంతో దేశం సురక్షితంగా నిలుస్తుంది. ఈ ఇద్దరూ దేశానికి రెండు కళ్లవంటివారు" అని పేర్కొన్నారు. అలాగే తమ కుమారుడిని దేశ రక్షణ కోసం పంపిన తల్లిదండ్రులు నిజమైన దేశభక్తులని కొనియాడుతూ, అలాంటి కుటుంబాలను సమాజం ఎప్పటికీ గౌరవంతో గుర్తుంచుకోవాలని అన్నారు.

రైతు కుటుంబం నుంచి వచ్చిన జవాను దేశ సేవలో ఉండటం వేల్పుచెర్ల గ్రామానికే కాకుండా మొత్తం రైతాంగానికే స్ఫూర్తిదాయకం అని తెలిపారు. మరి ముఖ్యంగా కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతు కుమారుడు కావటం యూనియన్ కి ఎంతో గర్వకారణమని తెలిపారు. రైతు దేశానికి అన్నం పెడితే, రైతు కొడుకు దేశానికి కాపలా కాస్తున్న జవాను. ఒకరు ఆకలి తీర్చితే...మరొకరు భద్రత కల్పిస్తున్నారు. దేశానికి ఇద్దరూ వెన్నెముకలే అని ఈ సందర్భంగా వారిని కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కూడా జవాను కుటుంబాన్ని అభినందిస్తూ, దేశ సేవలో ఉన్న జి.శ్రీకాంత్ గారు గ్రామానికి మరియు రైతు కుటుంబాలకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. తమ గ్రామం నుంచి దేశ రక్షణలో సేవలందిస్తున్న యువకుడు ఉండటం ఎంతో గర్వంగా ఉందని పేర్కొంటూ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు టి.నాగేశ్వర రావు, సొసైటీ అధ్యక్షులు జి.మల్లికార్జున రావు, వేతన కార్యదర్శి జె.వెంకటేశ్వర రావు, పాడి రైతులు పాల్గొన్నారు.



# ఘనంగా మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలు

- యాదగిరిగుట్ట మున్సిపల్ మహిళా కార్మికులకు చీరల పంపిణీ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 23:**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు యాదగిరిగుట్ట పట్టణంలోని శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకొని యాదగిరిగుట్ట పట్టణంలోని కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులుగా సేవలందిస్తున్న యాదగిరిగుట్ట మున్సిపల్ మహిళా కార్మికులను గౌరవిస్తూ వారికి చీరలను పంపిణీ చేశారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎల్లప్పుడూ పేదలకు, పెద్దలకు అండగా నిలుస్తున్నారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట, ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ వాణిభరత్ గౌడ్, బీజని బాలమణి బాస్కర్, కౌన్సిలర్ బూడిద మధు, కోఆప్షన్ సభ్యులు గౌళికౌర్ అరుణరాజేష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షుడు ముక్కెర్ల మల్లేష్ యాదవ్, మంగ సత్యనారాయణ, టీటీడీ లోకల్ అడ్వైజరీ మాజీ సభ్యుడు వడ్లోజు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నేతలు బీర్ల శంకర్, చీర శ్రీశైలం,నీలం పద్మ, నమిలే మహేందర్, వెంకట్ రాజు, హేమేందర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు బహుమతులు అందజేసిన పాలమూరు ఎమ్మెల్యే




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని దేవరకద్ర మండలం కోయిల్ సాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులకు శనివారం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి బహుమతులను అందజేశారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళిక యూత్ అండ్ స్పోర్ట్స్ వారోత్సవ ముగింపు సందర్భంగా, గతంలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే ఈ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు కనకప్ప, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్ర ఎమ్మార్వో కు సన్మానం



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర తహసిల్దార్ కు శనివారం కోయిల్ సాగర్ సర్పంచ్ సందప్ప ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ దోషులను కఠినంగా శిక్షించాలి

- సిట్ ముందు వాంగ్మూలం ఇచ్చిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

గత ప్రభుత్వం ఇల్లీగల్ గా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని, ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడ్డ దోషులను కఠినంగా శిక్షించాలని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) డిమాండ్ చేశారు. సిట్ అధికారులు గత ప్రభుత్వం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ చేయడం జరిగిందని ఫోన్ ట్యాపింగ్ కు సంబంధించి వాంగ్మూల అంద చేయాలని కోరడంతో ఎమ్మెల్యే జిఎంఆర్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ లో హిట్ ముందు శనివారం హాజరై వాంగ్మూల అంద చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడారు.గత ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడుతున్న నాటి టీపీసీసీ అధ్యక్షులు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కట్టడి చేయడానికి గత ప్రభుత్వం ఇల్లీగల్ గా ఫోన్ ట్యాపింగ్ కు పాల్పడిందని, డీసీసీ అధ్యక్షులు గా ఉన్న సమయంలో మా ఫోన్లను ట్యాప్ చేయడం జరిగిందని, దానికి సంబంధించి సిట్ వాంగ్మూలం ఇవ్వాలని కోరడంతో వాంగ్మూలం ఇవ్వడం జరిగిందని తెలిపారు.



## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే జిఎంఆర్ శుభాకాంక్షలు

జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లోని సెక్రటేరియట్ లో శనివారం ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని మంత్రికి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి,డోకూర్ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు సహకరించండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో ఎమ్మెల్యే జిఎంఆర్ చర్చ
- వివిధ శాఖల అధికారులతో సమావేశం



జయభేరి, దేవరకద్ర :

హైదరాబాద్ లో శనివారం మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనుల విషయమై ఆర్ అండ్ బి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) చర్చించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులపై సుదీర్ఘంగా చర్చించారు. అలాగే మంత్రికి ఎమ్మెల్యే జిఎంఆర్ వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా వివిధ శాఖల అధికారులతో కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ సమావేశమై అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి లతోపాటు కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనంలో పాల్గొన్న ప్రశాంత్ రెడ్డి




జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన హిందూ సమ్మేళనంలో దేవరకద్ర నియోజకవర్గ బిజెపి పార్టీ ఇన్చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సాదుపంత్ అధ్యక్షుడు శ్రీశ్రీశ్రీ శంకర్ స్వామీజీ, సామాజిక కార్యకర్త మౌనిక సుంకర, సంస్కార భారతి ప్రాంత సంఘటన మంత్రి జమాల్ పూర్ నిరంజన్ లతోపాటు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, గ్రామస్తులు, హిందూ బంధువులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇర్షాద్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక SIR అవగాహన శిబిరం



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ఆధ్వర్యంలో బీరప్పగడ్డ డివిజన్‌లోని బీరప్పగడ్డ కైట్ షాప్ వద్ద ప్రత్యేక SIR అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పాత, కొత్త ఓటర్ ఐడి కార్డులను పరిశీలించుకున్నారు. BLOలు ఇంటికి వచ్చినప్పుడు మొబైల్ యాప్‌లో సులభంగా మ్యాపింగ్ చేయడానికి డమ్మీ SIR ఫారమ్‌లను నింపి ప్రజలకు అందజేయడం జరిగింది. అలాగే పాత, కొత్త ఓటర్ ఐడీలతో పాటు కుటుంబ సభ్యులు, తల్లిదండ్రుల వివరాలను మ్యాపింగ్ చేసి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ అవగాహన శిబిరం ద్వారా సుమారు 1800 మంది ఓటర్లకు సహాయం చేసి, SIR ప్రక్రియపై స్పష్టమైన సమాచారం అందించారు. ప్రజలకు ఓటర్ నమోదు, ధృవీకరణ ప్రక్రియ సులభంగా జరిగేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఇర్షాద్ ఖాన్ తెలిపారు. స్థానిక ప్రజలు ఈ శిబిరానికి విశేష స్పందన తెలియజేశారు.

# ఎవరికి ఎర్త్.. ఎవరికి బెర్త్..

- రేసులో ఈటెల, ధర్మపురి

జయభేరి, హైదరాబాద్, మే 23 :



తెలంగాణలో బీజేపీ బలపడుతున్న తరుణంలో, కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ రాజకీయ వర్గాల్లోనూ వేడి పుట్టిస్తోంది. కేంద్రంలో మోదీ 3.0 సర్కార్ రెండేళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో, తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కనిపిస్తోంది. రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ, సామాజిక సమీకరణాలను బ్యాలెన్స్ చేసే దిశగా కొత్త నిర్ణయాలు తీసుకోబోతోంది. ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ కు కేబినెట్ ర్యాంకు ఇస్తారనే టాక్ ఢిల్లీ వర్గాల్లో వినిపిస్తోంది. ఆయనకు ఉన్న మాస్ ఇమేజ్, పార్టీ కేడర్‌లో ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని ఆయన పోర్ట్‌ఫోలియోను పెంచే అవకాశం ఉంది.

వాస్తవానికి ఆయన కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసుతో ఆయనను అసలు మంత్రి వర్గం నుంచి భర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ లాంటి పార్టీలు డిమాండ్ చేస్తున్నారు. కానీ మోదీ భిన్నంగా ఆలోచించే అవకాశం ఉంది.

తెలంగాణ రాజకీయాల్లో బలమైన నేతగా ఉన్న ఈటల రాజేందర్‌ను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకుంటారనే గాసిప్స్ బలంగా వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయనను కేంద్రంలోకి తీసుకోవడం ద్వారా బీఆర్ఎస్, కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండి కొట్టవచ్చని బీజేపీ యోచిస్తోంది. ఆయనకు కేబినెట్ లేదా స్వతంత్ర హోదా కలిగిన రాష్ట్ర మంత్రి పదవి దక్కవచ్చని ప్రచారం. మహిళా కోటాలో, దక్షిణ తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహించే నేతగా డి.కె. అరుణ పేరు పరిశీలనలో ఉంది. జాతీయ స్థాయిలో పార్టీ ఉపాధ్యక్షురాలిగా పనిచేసిన అనుభవం ఆమెకు కలిసి వచ్చే అంశం. ఉత్తర తెలంగాణ నుంచి బలమైన వాయిస్ వినిపించే అరవింద్‌ను కూడా ఏదైనా కీలక బాధ్యతల్లోకి తీసుకునే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ప్రస్తుతం బొగ్గు, గనుల శాఖ మంత్రిగా ఉన్న జి. కిషన్ రెడ్డికి బాధ్యతల మార్పు ఉంటుందా అనే చర్చ కూడా నడుస్తోంది.

ఆయనను పూర్తిగా పార్టీ సంస్థాగత పనులకు పరిమితం చేస్తారా లేదా ఇంకా కీలకమైన శాఖను అప్పగిస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నందున, ఆయన అనుభవాన్ని ఎక్కడ వినియోగిస్తారనేది ప్రధాని నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

తెలంగాణలో 2028 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా మోదీ తన టీమ్‌ను సిద్ధం చేసుకుంటున్నారు. కేబినెట్ లో చోటు కల్పించడం ద్వారా ఆయా ప్రాంతాల్లో బీజేపీ బలాన్ని పెంచుకోవాలన్నది వ్యూహం. ఒకవేళ కేబినెట్ విస్తరణ జరిగితే తెలంగాణ నుంచి కనీసం ముగ్గురు లేదా నలుగురికి అవకాశం దక్కవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి మరోసారి కేంద్ర కేబినెట్‌ను పునర్ వ్యవస్థీకరించే అవకాశం లేదు. అందుకే వచ్చే ఎన్నికలకు ఇప్పుడే పూర్తి స్థాయిలో మంత్రివర్గ సమీకరణాలనులెక్కలోకి తీసుకోనున్నారు.

## కేకే కమిటీతో ఉద్యమకారుల సమన్వయం

జయభేరి, హైదరాబాద్ :




ఒక్కరోజు కాదు రెండు రోజులు కాదు ఎడతెరిపిలేని ఉద్యమకారుల పోరాటం, తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల జేఏసీ ఏర్పాటు చేసినప్పటి నుంచి, తమాం ఇరాం లేకుండా, ఎన్నెన్నో సభలు సమావేశాలు, తెలంగాణ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, మినిస్టర్లకు ఉద్యమకారుల గుర్తింపు గురించి ఎటువంటి ప్రమాణాలు చేపడితే బాగుంటుంది అనే అంశంపై ఎన్నో కీ నోట్లు సమర్పించడం, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేతో సివిల్ సొసైటీ ఆధ్వర్యం లో హైదరాబాద్ లో సమావేశం ఏర్పాటు చేయడం, అప్పటి తెలంగాణ కాంగ్రెస్ ఇన్చార్జ్ అయినటువంటి మాణిక్ రావు తాకరేతో మాట్లాడి తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో కీలక అంశాలను పొందుపరచడం, వంటి ఎన్నో కార్యక్రమాలు క్రియాశీలకంగా చేపట్టడం, జస్టిస్ చంద్రకుమార్ సూచనల మేరకు తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ కమిటీని ఏర్పాటుచేసి, కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో నిరసన పోరాటాలు చేయడం, మొన్నటికి మొన్న అసెంబ్లీ ముట్టడిని నిర్వహించడం, అదేవిధంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను బిక్షగాలుగా మారుస్తుందన్న అంశంతో కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ అయిన గాంధీభవన్ ఎదుట నిరసన భిక్షాటన దీక్షను చేపట్టడం, మల్ల ఎన్నెన్నో కేసులు ఎదుర్కొంటూ, పోరాటాలకు ఉద్యమకారులు ఎవరు వెనుతిరగని సందర్భంలో, ప్రభుత్వం Go 679 ద్వారా కేకే కమిటీని ఏర్పాటు చేసింది. రామగిరి ప్రకాష్ అధ్యక్షతన, "కేకే కమిటీతో ఉద్యమకారుల సమన్వయ కమిటీ", రౌండ్ టేబుల్ సమావేశంలో కమిటీ సభ్యులు రాములు నాయక్ అదే విధంగా మోతే శోభన్ రెడ్డి హాజరై కమిటీ యొక్క రూపము ఉద్యమకారులను ఎన్నుకునే ప్రక్రియ మొదలగు విషయాల పైన ఉద్యమకారులతో చర్చ చేయడం జరిగింది.

## అన్న ప్రసాదం అందిస్తూ.. ఎందరికో ఆదర్శ వంతం...

- నేటి యువతకి ఆదర్శముగా ఉన్న దేవని అభినందించిన సామాజిక కార్యకర్త డా లక్ష్మి వీరమల్లు

జయభేరి, మేడిపల్లి :




ఆకలితో అలమటించే వారికి అనునిత్యం తనకి తోచిన విదంగా వంద లాది మందికి ఎక్కడ వీలు అయితే అక్కడ 45 డిగ్రీల ఎండలో రోడ్డు మీద ఏదోఒక చెట్టు నీడను ఆసరా చేసుకుని వారికి ఉచితంగా అన్న ప్రసాదం అందిస్తూ ఎందరికో ఆదర్శ వంతంగా నిలుస్తున్నాడు ఒక సదారణ రైతు బిడ్డ సాఫ్ట్ వేరు ఉద్యోగి "దేవ" ఇతను ఈ రోజు ప్రముఖ సామాజిక కార్యకర్త దృష్టిలోకి వచ్చాడు. సమయం మిట్ట మధ్యాహ్నం ఒంటిగంట ఒక్కడే వంట సామాగ్రీతో రోడ్డు ప్రక్కన చెట్టు నీడలో సదురుతున్న విధానం చూసి చలించిన సామాజిక కార్యకర్త డా లక్ష్మీవీరమల్లు దేవను పలకరించి వివరాలు అడిగి తెలుసుకొని వయస్సును. ఎండను ఎండ... వేడిని సైతం లెక్క చేయక ఆ యువకునికి సహాయంగా నిలిచి వంద లాది ప్రజలకు అతనితో పాటు వంట పాత్రలు కాలి అయ్యే వరకు వడ్డించి ఆయువకున్ని మనసారా అభినందించి అక్కడి యువతకు కూడా ఇట్టి విషయం చెప్పి సమాజంలో యువత పాత్ర చాలా కీలకం అని అన్ని రంగాలో పట్టు సాధిస్తూ. సంపాదిస్తూ కాస్త ఇలాంటి సామాజిక. సహాయం చేస్తూ ఆదర్శంగా నిలువాలి అని కోరారు. పెద్దలు కూడా ఈ వైపు ఆలోచన చేస్తూ చేతనైన సహాయ సహాకారం సమాజానికి అందివాలని విజ్ఞప్తి చేశారు.

## "భారత్ సమాజ సేవ రత్న అవార్డు 2026" ఏ. పద్మాచారి

- మాజీ కేంద్ర మంత్రుల సమక్షంలో ఘన సత్కారం.. సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రతిష్టాత్మక అవార్డు ప్రదానం
- సమాజ సేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతానన్న పద్మాచారి

జయభేరి, న్యూఢిల్లీ :

సమాజ సేవా రంగంలో విశేష కృషి చేస్తున్న ఏ. పద్మాచారి గారికి ప్రతిష్టాత్మకమైన "భారత్ సమాజ సేవ రత్న అవార్డు - 2026" ప్రదానం చేయబడింది. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ జ్ఞాపకార్థంగా నిర్వహించిన ఈ అవార్డును ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ ఘనంగా అందజేసింది. ఈ అవార్డును మాజీ కేంద్ర మంత్రి ప్రొఫెసర్ మురళీ మనోహర్ జోషి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, జాతీయ వెనుకబడిన వర్గాల కమిషన్ (ఎన్సీబీసీ ) చైర్మన్ జనార్ధన్ సింగ్ సిగ్రీవాల్, ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్సీ సురేందర్ చౌదరి, ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జ్ఞానేంద్ర విశ్వకర్మ, అలాగే హెచ్. హెచ్. మహారాజా శ్రీమంత్ రామ్లక్ష్మణ్ సింగ్ పాల్గొన్నారు. సమాజ సేవ, ప్రజా సంక్షేమం, దేశ నిర్మాణానికి కృషి చేస్తున్న జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, సామాజిక సేవకులు, ఎన్జీవోలు, బ్యూరోక్రాట్లు మరియు వినోద రంగ ప్రముఖులను ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్ ప్రతి సంవత్సరం సత్కరిస్తూ వస్తోంది. ఈ సందర్భంగా ఏ. పద్మాచారి మాట్లాడుతూ, తన సేవా కార్యక్రమాలను గుర్తించి గౌరవించిన ఆల్ మీడియా కౌన్సిల్ ఫౌండేషన్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను, సమాజ సేవలో ఇంకా ఎక్కువ అంకితభావంతో పని చేయాలనే ప్రేరణను ఇచ్చిందని పేర్కొన్నారు



## ఆంజనేయ స్వామికి పూజలు

- పూజారి రాజమూరి హనుమేష్ చారి ఆధ్వర్యంలో అభిషేకాలు

జయభేరి, దేవరకద్ర :

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రామ్ నగర్ వన్ టౌన్ సమీపంలోనున్న శ్రీ బాలాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ దేవాలయంలో ప్రతి శనివారం స్వామివారికి పూజారి రాజమూరి హనుమేష్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పూజా కార్యక్రమాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. విశేష దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వామివారిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. దీంతో స్వామివారు అలంకరణలో భక్తకోటికి దర్శనం ఇచ్చారు. ఈ దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు.

## ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి




జయభేరి, మేడిపల్లి :

పోలీస్ అవేరేనెస్ ప్రోగ్రాం కాలనీ వాసులు, పెద్దలతో మేడిపల్లి ఏసీపీ, మేడిపల్లి సీఐ, చెంగిచెర్ల సెక్టార్ ఎస్ సై, ప్రజల్లో దొంగతనాలు జరుగకుండా ఏసీపీ ప్రజలు కొన్ని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈ కార్యక్రమంలో సూచించారు. 1. ఊరికి వెళ్ళేటప్పుడు ఇంటి ఆవరణంలో బట్టలు, చెప్పులు కనపడే విదంగా ఉంచాలి. 2. బయట లైట్స్ వేసి ఉంచాలి, అలాగే గేటు కు ముందు వైపు తాళం వేయకూడదు. 3. బంగారు ఆ భారణలు, బ్యాంకు లో కానీ ప్రక్క వారి ఇంట్లో ఉంచి వెళ్ళాలి. ఎవరైనా క్రొత్త వ్యక్తులు కాలనీలో సంచరించినచో వారిపై నిఘా ఉంచి అడిగి తెలుసుకోవాలి. 4. ఈ కార్యక్రమం ముఖ్య విషయం పెట్రోలింగ్ ప్రతి రోజు కొండా పోచమ్మ. టెంపుల్ వద్దకు వచ్చి వెల్లి విదంగా చూస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా ఇంట్లో పని మనుషలను నియమించుకునే ముందు వారి యొక్క పూర్తి వివరాలు సురక్ష ఆప్ లో పొందుపరచగలరని పోలీసు వారు వివరించారు. 5. ప్రతి ఒక్క మెయిన్ రోడ్డు ఇన్ అవుట్ వెళ్లె దారికీ సిసి కెమెరా బిగించాలి. అవి పోలీస్ పరిరక్షణలో పనిచేయాలి. ఏసీపీ, సీఐ చెంగిచెర్ల సెక్టార్ ఎస్ ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క కెమెరా వంద పోలీస్ వారితో సమానం, పోలీస్ వారికీ దొంగలను చెధించి పట్టుకోవడానికి సులువుగా వీలు అవుతుంది అని ఈ సందర్భంలో వీరు పేర్కొన్నారు.




# ఉప్పల్‌లో సన్‌రైజర్స్ జయభేరి

టించిన ఇషాన్‌తో పాటు క్లాసెన్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లే బాధ్యత తీసుకున్నారు. సూపర్ ఫామ్‌లో ఉన్న క్లాసెన్.. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో మూడు సిక్సర్లు, ఓ ఫోర్‌తో రెచ్చిపోయిన ఏకంగా 27 రన్స్ రాబట్టి స్కోరు 150 దాటించాడు. మరో ఎండ్‌లో ఇషాన్ కూడా భారీ షాట్లు కొడుతూ 31 బంతుల్లో ఫిఫ్టీ మార్కు దాటాడు. తర్వాత మరింత జోరు పెంచిన అతను రసిఖ్ బౌలింగ్‌లో 6, 4, 4 కొట్టగా.. తన ధాటిని కొనసాగించిన క్లాసెన్ 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. వీళ్ల జోరుకు 16 ఓవర్లకే స్కోరు 200 దాటింది. తర్వాతి ఓవర్లో స్పిన్నర్ కృనాల్ పాండ్యా.. క్లాసెన్‌ను ఔట్ చేసి రెండో మూడో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని ముగించాడు. కానీ, తర్వాతి రెండు బాల్స్‌ను స్టాండ్స్‌కు పంపిన నితీశ్ (29*) హేజిల్‌వుడ్ ఓవర్లో మరో సిక్స్‌తో అలరించాడు. చివరి రెండు ఓవర్లలో ఆర్సీబీ బౌలర్లు వరుసగా 8, 9 పరుగులే ఇచ్చి ఆఖరి బంతికి ఇషాన్‌ను ఔట్ చేసినా హైదరాబాద్ 250 మార్కు దాటింది.

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీని 166 పరుగుల్లోపు కట్టడి చేస్తే టాప్2లో నిలిచే అవకాశం ఉన్నా.. రైజర్స్‌కు ప్రత్యర్థి ఆ చాన్స్ ఇవ్వలేదు. ఛేదనను బెంగళూరు ధాటిగానే ఆరంభించింది. తొలి ఓవర్లోనే కమిన్స్‌కు ఫోర్, సిక్స్‌తో స్వాగతం పలికిన ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ పవర్ ప్లేలో మెరుపులు మెరిపించాడు. స్పిన్నర్ శివంగ్ వేసిన నాలుగో ఓవర్లో 6,4,6,6తో చెలరేగి స్కోరు యాభై దాటించాడు. కానీ, తర్వాతి ఓవర్లో మళ్లీ బౌలింగ్‌కు వచ్చిన ఈషాన్ మలింగ అతడిని ఔట్ చేసి ఆర్సీబీని తొలి దెబ్బకొట్టాడు. తర్వాతి ఓవర్లో విరాట్ కోహ్లీ (15)ని సాకిబ్ పెవిలియన్ చేర్చడంతో అతని ఫ్యాన్స్ అంతా షాకయ్యారు. రెండు ఫోర్లు, ఓ సిక్స్‌తో దూకుడుగా ఆడుతున్న పడిక్కల్ (21)ను తొమ్మిదో ఓవర్లో మలింగ పెవిలియన్ చేర్చడంతో ఆర్సీబీ 94/3తో నిలిచింది. ఇక్కడి నుంచి ఆతిథ్య బౌల కట్టుదిట్టమైన బంతులు వేయడంతో కెప్టెన్ రజత్, కృనాల్ పాండ్యా (41 నాటౌట్) వేగంగా ఆడలేకపోయారు. ఫలితంగా సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరిగింది. ఒత్తిడిలోనూ క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టిన రజత్ అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జట్టు టాప్ ప్లేస్‌ను ఖాయం చేసిన తర్వాత 19వ ఓవర్లో పార్ట్‌టైమ్ స్పిన్నర్ హెడ్‌కు వికెట్ ఇచ్చుకున్నాడు. చివరి ఓవర్లో 6,4 కొట్టిన టిమ్ డేవిడ్ (15 నాటౌట్) స్కోరు 200 దాటించాడు.

9 ఐపీఎల్‌లో భువనేశ్వర్ ఓ ఇన్నింగ్స్‌లో 50 ప్లస్ రన్స్ ఇచ్చుకోవడం ఇది అత్యధికంగా తొమ్మిదోసారి. షమీ రికార్డును సమం చేశాడు.

6 ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ 250 ప్లస్ స్కోరు చేయడం ఇది అత్యధికంగా ఆరోసారి.

**సంక్షిప్త స్కోర్లు**

సన్‌రైజర్స్: 20 ఓవర్లలో 255/4 (ఇషాన్ 79, అభిషేక్ 56, క్లాసెన్ 56, రసిఖ్ దార్ 2/52);
బెంగళూరు: 20 ఓవర్లలో 200/4 (రజత్ 56, వెంకటేశ్ 44, ఈషాన్ మలింగ 2/33)



# ఐపీఎల్‌లో 'ధోనీ స్కామ్'..

డు. 'సీజన్ ఆరంభం నుంచి ధోనీ గురించి కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్‌లు ప్రతిసారి అబద్ధాలు చెబుతూ వచ్చారు. మొదట కాలి గాయంతో ధోనీ బాధ పడుతున్నాడని, అతడు త్వరలోనే జట్టుతో కలవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ధోనీ తర్వాతి మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని చెపాక్‌లో చివరి మ్యాచ్ టాస్ సందర్భంగా గైక్వాడ్ తెలిపాడు. ఆ మ్యాచ్‌కు ముందు నెట్స్‌లో ధోనీ ప్రాక్టీస్ చేస్తున్న వీడియోను సీఎస్కే తమ ఎక్స్ ఖాతాలో పెట్టింది. దాంతో, తాలా కచ్చితంగా సన్‌రైజర్స్‌తో ఆడుతాడని అభిమానులు గంపెడు ఆశలతో మైదానానికి పోటెత్తారు. కానీ, మళ్లీ వారికి నిరాశే మిగిలింది' అని శ్రీకాంత్ యూట్యూబ్ ఛానెల్లో ఆగ్రహం వ్యక్తం చేశాడు. నిజానికి ధోనీని ఎవరూ మిస్ అవ్వడం లేదని పేర్కొన్న శ్రీకాంత్ దిగ్గజ ఆటగాడి గురించి సరైన సమాచారం ఇవ్వాల్సిన యాజమాన్యం అభిమానుల మనోభావాలతో ఆడుకుందని విమర్శించాడు. 'నిజం చెప్పాలంటే ధోనీని ఎవరూ మిస్ కావడం లేదు. ధోనీని ఆడించాలని ఎవరూ కోరడం లేదు. ఎందుకంటే ఐపీఎల్‌లో ధోనీ శకం ముగిసింది. ఐపీఎల్ దిగ్గజ ఆటగాళ్లలో ధోనీ ఒకడు. గొప్ప కెప్టెన్ కూడా. కాబట్టి.. చెన్నై యాజమాన్యం అతడి గురించి నిజాలు చెప్పాల్సింది. కానీ, సీజన్ ఆసాంతం ఇదుగో వస్తున్నాడు అంటూ సీఎస్కే ఫ్రాంచైజీ కోట్లాది మంది అభిమానులను పిచ్చోళ్లను చేసింది' అని శ్రీకాంత్ అసహనంతో రగిలిపోయాడు.



# పొద్దునే ప్రొటీన్ ఫుడ్

పొద్దుననిద్ర లేచిన వేళా విశేషమే రోజంతటినీ నిర్ణయిస్తుంది. పొద్దునే మన టిఫిన్లలో ఇడ్లీ, పోహా, ఉప్మా, ఆలూ పరాఠా లాంటివి ప్రధానంగా ఉంటాయి. ఇవన్నీ కార్బొహైడ్రేట్లతో నిండి ఉంటాయి. కానీ ఆరోగ్యానికి అత్యవసర పోషకమైన ప్రొటీన్ ఉండదు. అయితే, ఉపాహారం నుంచే 20 గ్రాముల ప్రొటీన్ అందేలా చూసుకుంటే మంచిది. అలాగని ప్రొటీన్ పౌడర్ల మీద ఆధారపడకూడదు. ఆహారంలో కొన్ని చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. పొద్దునే ఆరగించడానికి ప్రొటీన్లతో సమృద్ధమైన టిఫిన్లు కొన్నిటి గురించి తెలుసుకుందాం.

శరీర విధులు సాఫీగా సాగాలంటే ప్రొటీన్లు సమృద్ధిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. శరీర కణజాలం, కండరాలు, ఎముకలు, చర్మం, వెంట్రుకలు, గోళ్ల నిర్మాణంలో ప్రొటీన్లు కీలకంగా నిలుస్తాయి. ఎంజైముల విడుదలలో ఇవి కీలకపాత్ర పోషిస్తాయి. అంతేకాదు ప్రొటీన్లు మన రోగ నిరోధక వ్యవస్థలో అంతర్భాగం. ప్రొటీన్లు తీసుకుంటూ తగినంత వ్యాయామం చేస్తే ఆరోగ్యకరమైన జీవితం సొంతమవుతుంది. ప్రొటీన్లు శరీరానికి మాత్రమే కాదు మెదడు పనితీరుకు కూడా అండగా నిలుస్తాయి.

## పల్లీలు కూరగాయలతో క్వినోవా ఉప్మా

ఓ కప్పు క్వినోవాలో 8 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. దీనికి కూరగాయలు, కరివేపాకు, ఓ టేబుల్ స్పూన్ వేయించిన పల్లీలు, పచ్చి బఠాణీలు కలపాలి. ఉడికించిన శనగలతో సలాడ్ తీసుకుంటే మొత్తం 22 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి. ఒక్క క్వినోవా ఉప్మా, కూరగాయలు, పల్లీల నుంచే 17 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## శనగపిండి టోస్ట్, టోఫు బుర్జి

రెండు బ్రెడ్ పకోడీలు (శనగపిండితో చేసినవి) తీసుకోవాలి. దీనికి 75 గ్రాముల టోఫు బుర్జీ జతచేయాలి. టమాటాలు, పసుపు, జీలకర్ర కలపాలి. దీని ద్వారా 23 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## రాజ్మా పరాఠా, కప్పు పెరుగు

మామూలుగా రాజ్మా లంచ్‌కే అనుకుంటారు. కానీ ఓ కప్పు రాజ్మాను ఉడికించి ముద్దగా చేసుకోవాలి. దాన్ని పరాఠా స్టఫ్‌గా వాడుకోవాలి. ఇలా చేస్తే 15 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని పుదీనా, సైంధవ లవణం కలిపిన హంగ్ కర్డ్ (నీళ్లు తీసేసిన పెరుగు)లో అద్దుకుని తినేయాలి.

## సత్తు పరాఠా, ఉడికించిన గుడ్డు, బటర్ మిల్క్


సత్తు అంటే వేసవి పానీయం మాత్రమే కాదు. 100 గ్రాముల సత్తులో 20 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. కాబట్టి, కొద్దిగా నెయ్యి వేసి సత్తు పరాఠా చేసుకోవాలి. తినే వాళ్లయితే దీంతోపాటు ఓ ఉడికించిన గుడ్డు తినాలి. గ్లాసెడు బటర్ మిల్క్ తాగాలి. రెండు మోస్తరు సత్తు పరాఠాల నుంచి 14 గ్రాములు, ఉడికించిన గుడ్డు నుంచి 6 గ్రాములు, బటర్‌మిల్క్ నుంచి 2 గ్రాములు.. మొత్తంగా 22 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## మూంగ్‌దాల్ చిల్లా పనీర్ ఫిల్లింగ్

ఒక్కో చిల్లా (దోశ లాంటిది)లో 5 6 గ్రాముల ప్రొటీన్లు ఉంటాయి. వీటిలో నింపే 50 గ్రాముల తురిమిన పనీర్ నుంచి 9 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి. రెండు చిల్లాలను ఓ కప్పు పెరుగుతో లాగించేయాలి. పెరుగుతో లభించే 5 గ్రాములతో కలుపుకొని మొత్తం 26 గ్రాముల ప్రొటీన్లు లభిస్తాయి.

## మొలక పెసర్లు ఓట్స్ చీలా

ఇది కూడా దోశలా చేసుకునేదే. అరకప్పు ఓట్స్‌లో 5 గ్రాముల ప్రొటీన్ దొరుకుతుంది. దీన్ని ఓ కప్పు పెసర మొలకలతో కలిపితే మరో 14 గ్రాములు లభిస్తాయి. దీనికి కాస్త శనగపిండిని జోడిస్తే మరో 2 గ్రాములు మొత్తంగా 21 గ్రాముల ప్రొటీన్లు దొరుకుతాయి.





# ఆమెకు 19.. ప్రేమ.. పెళ్లి...

సౌత్ ఇండస్ట్రీలో చిన్న వయసులోనే విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న హీరోయిన్ ఆమె. మొదటి ఒకటి రెండు చిత్రాలతోనే సినీరంగంలో చక్రం తిప్పింది. కానీ 19 ఏళ్లకే 32 ఏళ్ల హీరోను ప్రేమించి పెళ్లి చేసుకుని అందరిని ఆశ్చర్యపరిచింది. ఆ తర్వాత అడపాదడపా చిత్రాలు చేస్తూ కథానాయికగా రాణిస్తుంది. ఇప్పటికీ భార్యభర్తలు ఇద్దరూ తోపు నటీనటులు కావడం విశేషం. ఆమె ప్రేమ, పెళ్లి వార్తలు అప్పట్లో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. ? ఇప్పటికీ అందం, అభినయంతో ప్రేక్షకుల హృదయాలు దోచుకుంటున్ నజ్రియా నజీమ్. నేరమ్ సినిమాతో తమిళ చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత అట్లీ తెరకెక్కించిన రాజా రాణి సినిమాతో తమిళంలోనే బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీని తెలుగులోనూ రిలీజ్ చేయగా భారీ విజయాన్ని అందుకుంది. ఈ మూవీ సౌత్ ఇండస్ట్రీలో ఆమె ఓవర్ నైట్ స్టార్ అయ్యింది.



## ఓటీటీలోకి ధనుష్ లేటేస్ట్ బ్లాక్ బస్టర్ హిట్

కోలీవుడ్ స్టార్ ధనుష్ సినిమాలకు దక్షిణాదిలో విపరీతమైన క్రేజ్ ఉంటుంది. అటు తమిళం, తెలుగు భాషలలోనే కాకుండా ఇటు హిందీలోనూ వరుస సినిమాలతో అలరిస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన లేటేస్ట్ హిట్ మూవీ కర. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ హెయిస్ట్ థ్రిల్లర్‌కు ఆల్ఫ్రెడ్ ప్రకాష్ రచన కూడా అందించారు. 1991 గల్ఫ్ యుద్ధ సమయంలో తమిళనాడులో ఇంధన సంక్షోభం తలెత్తడంతో, ధనుష్ అలియాస్ కరసామి (అ) కర అనే ఒక దొంగ తన జీవనోపాధి కోసం పోరాడవలసి రావడమే ఈ సినిమా కథ. ఎంతో అంచనాల మధ్య ఏప్రిల్ 30న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి మిశ్రమ స్పందన వచ్చింది. ఇది బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేక, ప్రపంచవ్యాప్తంగా కేవలం సుమారు రూ. 41 కోట్లు మాత్రమే వసూలు చేసింది. తాజాగా ఈ సినిమా ఓటీటీ స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్ చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ మే 28 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ యాప్‌లో దీని స్ట్రీమింగ్ వివరాలను అధికారికంగా వెల్లడించింది. ఇందులో మమితా బైజు , కేఎస్ రవికుమార్, కరుణాస్, జయరామ్, పృథ్వీ రాజన్, సూరజ్ వెంజరమూడు, ఎంఎస్ భాస్కర్, శ్రీజ రవి , పృథ్వీ పాండియరాజన్ కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఈ చిత్రం తమిళ, తెలుగుతో సహా పలు భాషల్లో అందుబాటులో స్ట్రీమింగ్ కానుంది. కథ విషయానికి వస్తే.. కరస్వామి (ధనుష్) ఒక దొంగ. అతడు ప్రేమించి పెళ్లి చేసుకున్న మల్లి (మమిత బైజు) కోసం తన నేర జీవితాన్ని వదిలేసి కష్టపడి బతకాలని నిర్ణయించుకుంటాడు. ఒక హోటల్ పెట్టడానికి ఊరిలో ఉన్న పొలం కాగితాలు బ్యాంకులో తాకట్టు పెట్టాలనుకుంటాడు. ఆ కాగితాల కోసమే చాలా సంవత్సరాల తర్వాత తన తండ్రి (కేఎస్ రవికుమార్) వద్దకు వెళతాడు. కానీ అనుకోకుండా తన తండ్రిని కోల్పోతాడు. తర్వాత కరస్వామి జీవితంలో ఎదురైన పరిస్థితులు ఏంటీ.. ? తన జీవితంలోకి ముత్తు సెల్వన్ (జయరామ్ ) ఎలా వచ్చాడు అనేది సినిమా.

## సరైన సమయంలో టైటిల్ రివీల్ చేస్తా!



అగ్ర కథానాయకుడు చిరంజీవి తన 158వ చిత్రానికి ఇటీవలే శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేఎస్ రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ శనివారం నుంచి హైదరాబాద్‌లో మొదలైంది. తొలి షెడ్యూల్‌లో చిరంజీవి, అనస్వర రాజన్‌లపై కీలక టాకీ పార్ట్‌ను దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్నారు. కథలో ఇవి చాలా కీలకమైన సన్నివేశాలని మేకర్స్ చెబుతున్నారు. ఈ సందర్భంగా వారు ఓ వీడియోను విడుదల చేశారు. ఇందులో ప్రధాన సాంకేతిక బృందాన్ని పరిచయం చేశారు. వీడియోలో ఉత్సాహంగా కనిపించిన చిరంజీవి 'లెట్స్ సెట్ ది బ్లడీ బెంచ్‌మార్క్..' అంటూ సందడి చేశారు. అనంతరం దర్శకుడు బాబీని సినిమా టైటిల్ గురించి ఆయన అడిగారు. బాబీ దాటవేయగా, దానికి చిరంజీవి సరదాగా స్పందిస్తూ.. 'సరైన సమయంలో నేనే టైటిల్ లీక్ చేస్తానేమో..' అంటూ చమత్కరించారు. వీరిద్దరి ఫన్నీ సంభాషణ వీడియోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి అత్యంత పవర్‌ఫుల్, ఇంటెన్స్ పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారాగణానికి చెందిన వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి. ఈ చిత్రానికి కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సంగీతం: తమన్.



## నాగ చైతన్య కోడలిగా..

తెలుగు చిత్ర పరిశ్రమలో హీరోయిన్లుగా చక్రం తిప్పిన తారలు చాలా మంది ఉన్నారు. అప్పట్లో వరుస సినిమాలోత మెప్పించి ఇప్పుడు సహాయ నటీమణులుగా వెండితెరపై సందడి చేస్తున్నారు. అందులో మనం మాట్లాడుకుంటున్న ఈ ముద్దుగుమ్మ ఒకరు. ఒకప్పుడు నాగార్జున సరసన నటించిన ఆమె.. ఆ తర్వాత నాగ చైతన్యకు కోడలిగా నటించింది. 'మనం' సినిమాలో కథా రీత్యా ఒక ఆసక్తికరమైన ట్విస్ట్ ఉంటుంది. ఈ చిత్రంలో నాగార్జునకు భార్యగా శ్రియ నటించింది. అయితే పూర్వజన్మల నేపథ్యంలో సాగే ఈ కథలో నాగార్జునకు తండ్రిగా నాగచైతన్య నటిస్తాడు. ఈ లెక్కన చూస్తే, 'మనం' సినిమాలో నాగచైతన్యకు కోడలి పాత్రలో శ్రియ కనిపించిందన్నమాట. ఒకప్పుడు తండ్రి సరసన జోడీ కట్టి, ఆపై కొడుకు పాత్రకు కోడలిగా నటించడం సినిమా రంగంలో చాలా అరుదుగా జరిగే విశేషం. పెళ్లి తర్వాత కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న శ్రియ, ప్రస్తుతం తన సెకండ్ ఇన్నింగ్స్‌లో దూసుకుపోతోంది. కేవలం తెలుగులోనే కాకుండా హిందీ, తమిళం, కన్నడ భాషల్లోనూ వరుస అవకాశాలు అందుకుంటోంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ, గ్లామరస్ ఫోటోషూట్లతో నెటిజన్లను అలరిస్తోంది. వయసు కేవలం అంకె మాత్రమేనని నిరూపిస్తూ శ్రియ సాగిస్తుంది ఈ ముద్దుగుమ్మ.

# పెద్ది రిలీజ్ ఆపాలని చూస్తున్నారు.. ఆమరణ నిరహార దీక్ష చేస్తా..



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ పెద్ది. ఈ సినిమా కోసం అభిమానులు వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు. బుచ్చిబాబు సన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా జూన్ 4న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ గా విడుదలకానుంది. ఈ సినిమాలో రామ్ చరణ్ కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తుంది. అలాగే ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా రిలీజ్ విషయంలో చాలా గందరగోళం నెలకొన్న విషయం తెలిసిందే. దాంతో విడుదల ఆలస్యం అవుతూ వచ్చింది. ఆతర్వాత మొత్తంగా జూన్ 4న సినిమా విడుదలకు సిద్ధం అయ్యింది. సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టింది పెద్ది సినిమా టీమ్. ఇటీవలే విడుదలైన ఈ సినిమా ట్రైలర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ ట్రైలర్ సినిమా పై అంచనాలను భారీగా పెంచేసింది. దాంతో ఈ సినిమా కోసం ఈగర్ గా ఎదురుచూస్తున్నారు. కాగా ఇప్పుడు పెద్ది సినిమా రిలీజ్ పై మరో గందరగోళం నెలకొంది. ఆంధ్రలో సినిమాకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినప్పటికీ తెలంగాణలో సినిమాలో విడుదలవుతుందా.? లేదా.? అన్న సందేహం నెలకొంది. తాజాగా తెలంగాణ ఎగ్జిబిటర్లు శనివారం తెలుగు ఫిలిం ఛాంబర్‌లో మాట్లాడుతూ.. 'పెద్ది'కి పర్సంటేజీ ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దాంతో పెద్ది రిలీజ్ పై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దాంతో నిర్మాత నట్టికుమార్ షాకింగ్ కామెంట్స్ చేశారు. పెద్ది సినిమా విడుదల అవ్వకపోతే నిరాహార దీక్ష చేస్తా అని చెప్పుకొచ్చారు. 'మీకు మంగళవారం నైట్ వరకు ఎదురుచూస్తాం.. ఎదో ఒకటి డిసైడ్ అవ్వండి.. మీరు పెద్ది సినిమాని ఆపాలని చూస్తే.. బుధవారం(మే 27) ఉదయం 10 గంటల నుంచి తెలుగు ఫిలిం ఛాంబర్ ఆధ్వర్యంలో ఆమరణ నిరహార దీక్షకు కూర్చుంటా.. చిరంజీవిగారి దగ్గరకు వెళ్దాం.. చిరంజీవి గారితో మాట్లాడదాం.. పెద్దలందరూ కలిసి పర్సంటేజీ విషయంలో ఓ నిర్ణయం తీసుకున్నారు. దాన్ని ఇప్పుడు మళ్లీ మీరు వెతిరేకించడం ఎంతవరకూ కరెక్ట్.?మీ వెనకాల కొంతమంది ఆడిస్తున్నారు. ఆ ఆటకు బలికావద్దు అంటూ నట్టికుమార్ చెప్పుకొచ్చారు. ఈ కామెంట్ట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**